జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 6 | జులై | 2026 • పేజీలు : 4

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 5, ప్రజాజ్యోతి** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు, కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ,ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.




- రూ.38,508 కోట్ల బకాయిలతో సింగరేణికి ఆర్థిక ఒత్తిడి
- తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచే అత్యధిక బకాయిలు
- పన్నెండేళ్లలో పన్నెండు రెట్లు పెరిగిన భారం
- బొగ్గు సరఫరా కొన సాగుతున్నా.. చెల్లింపుల్లో జాప్యం
- సంస్థ విస్తరణ, కొత్త గనులపై ప్రభావం
- ప్రభుత్వ జోక్యంపై పెరుగుతున్న డిమాండ్లు

# సింగరేణికి... బకాయి కష్టాలు..!

2 లో..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా ప్రభుత్వాల ఘనతగా ప్రచారం పొందుతున్నా, ఆ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన సింగరేణి కాలరీస్ కంపెనీ మాత్రం భారీ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును నిరంతరం సరఫరా చేస్తున్నప్పటికీ, తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో సింగరేణిపై వేల కోట్ల రూపాయల బకాయిల భారం పడింది. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు రూ.3 వేల కోట్లుగా ఉన్న బకాయిలు, జూన్-2026 నాటికి అన్ని సంస్థలు కలిపి రూ.38,508 కోట్లకు చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

## ఘనంగా NFAEE 8వ అఖిల భారత మహాసభలు ప్రారంభం



- ప్రజ్వలన జ్యోతి వెలిగించిన ఎమ్మెల్యే పాయం, ఎంపీ పోరిక బలరాం నాయక్, జనరల్ సెక్రెటరీ వెంకటేశం,
- ముఖ్య అతిథులు గా విచ్చేసిన పినపాక శాసనసభ్యులుపాయం వెంకటేశ్వర్లు, ఎంపీ పోరిక బలరాం నాయక్,

**అశ్వాపురం, జూలై 5, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధి గౌతమ్ నగర్ కాలనీలో తరంగణి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎంప్లాయిస్ (NAFEE) 8 వ అఖిల భారత మహాసభ కు ముఖ్య అతిథులుగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు కోరిక బలరాం నాయక్,ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు రిసెప్షన్ కమిటీ చైర్మన్ కామ్రేడ్డం రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల అగ్ర నేతలు అతిధులుగా హాజరై ఈ మహాసభకు బలాన్ని చేకూర్చారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు

మిగతా 2 లో...

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- ముత్యాలంపాడు, చుక్కాలబోడులో గృహప్రవేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య
- ప్రతి అర్హ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**టేకులపల్లి, జూలై 05,ప్రజాజ్యోతి:** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని,ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత నివాసం కల్పిస్తున్నామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డు, చుక్కాలబోడు గ్రామాల్లో ఆదివారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులు మాలోత్ లిఖిత–నరేందర్

మిగతా 2 లో...

## పంట విస్తీర్ణానికి అనుగుణంగా
# యూరియా బుకింగ్ చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 5,(ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా ఎరువుల సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు యూరియా బుకింగ్ యాప్లో పలు మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సవరించిన ఈ మార్గదర్శకాలు నేటి నుంచి జరిగే అన్ని యూరియా బుకింగ్ లకు అమల్లోకి వస్తాయని తెలి



పారు, యూరియా బుకింగ్ ను పంట విస్తీర్ణానికి అనుగుణంగా దశలవారీ విధానంలో నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. రెండు ఎకరాల వరకు సాగు చేసే రైతులు తమ పంటకు అవసరమైన మొత్తం యూరియాను ఒకేసారి బుక్ చేసుకుని పొందవచ్చని అన్నారు . రెండు ఎకరాలకు పైగా ఐదు ఎకరాల వరకు సాగు చేసే రైతులు పంట అవసరానికి అనుగుణంగా యూరియాను రెండు విడతలుగా బుక్ చేసుకోవాలని సూచించారు. ఐదు ఎకరాలకు పైగా సాగు చేసే రైతులకు యూరియా మూడు విడతలుగా 40 శాతం

మిగతా 2 లో...

## చేయి కోల్పోయిన కార్మికుడికి భరోసాగా నిలిచిన బీఆర్ఎస్

- బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం
- బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా



**అశ్వారావుపేట, జూలై 5 (ప్రజాజ్యోతి ):** అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన మడకం ప్రసాద్ ప్రమాదంలో చేయి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం అతని కుటుంబాన్ని పరామర్శించారు.మూడు నెలల క్రితం దమ్మపేట మండలంలోని ఓ రైస్‌మిల్లులో పని చేస్తున్న సమయంలో యంత్రంలో చేయి చిక్కి తీవ్రంగా గాయపడిన ప్రసాద్ ఒక చేయి కోల్పోయాడు. ప్రస్తుతం భార్య వీరభద్రమ్మ ఇద్దరు చిన్నారులతో కలిసి అత్యంత నిరుపేద పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని నాయకులు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి పండ్లు అందజేసి, తక్షణ అవసరాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం కాసాని నాగశేష పద్మ–చంద్రమోహన్, భూక్య ప్రసాద్, డాక్టర్ ఉదయజ్యోతి దంపతులు (కౌన్సిలర్) మాట్లాడుతూ, ప్రమాదం కారణంగా కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ కొనసాగుతాయని, కుటుంబానికి అన్ని విధాలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్‌మూర్తి, జుజ్జరపు శ్రీరామ్‌మూర్తి, సత్యవరపు సంపూర్ణ, మోటూరి మోహన్, నారాయణపురం గ్రామపంచాయతీ బీఆర్ఎస్ నాయకులు జక్కుల రాంబాబు, చందా లక్ష్మీనరసయ్య, నారం అనురాధ, కలపాల మంగారాజు, కౌలూరి నరేష్, కంగాల బాబురావు, గొంది వెంకన్నబాబు, గొంది గంగాలక్ష్మి , గొంది కనకమ్మ, తాటి అనురాధ, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పంట విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా బుకింగ్ చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి... )

30 శాతం, 30 శాతం నిష్పత్తిలో బుకింగ్ అయ్యే విధంగా యాప్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు.రెండు యూరియా బుకింగ్ ల మధ్య కనీసం 20 రోజుల వ్యవధి తప్పనిసరిగా ఉండేలా నిబంధన అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ప్రభుత్వం రూపొందించి సవరించిన మార్గదర్శకాల ప్రకారం యూరియా బుకింగ్ చేసుకోవాలని, అవసరానికి మించి యూరియాను బుక్ చేసేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. జిల్లాలో యూరియా ఎరువుల లభ్యతకు ఎలాంటి ఇబ్బంది లేదని, రైతులం దరికీ అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ విస్తరణ అధికారి లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని, రైతులందరూ యూరియా బుకింగ్ యాప్ లో అమలులోకి వచ్చిన సవరించిన విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ అంకిత్ కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ తరువాయి... )

, మాలోత్ శ్రీను–జ్యోతి నూతన గృహాలను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులను అభినందించిన ఆయన కొత్త ఇంట్లో సుఖశాంతు లు , ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం తో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో గృహనిర్మాణం కీలకమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది నిరుపేద కుటుంబాలు సొంత ఇంటి కలను నిజం చేసుకుంటు న్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చంద్రకళ, సర్పంచ్ బానోత్ పూలబంతి, కోయగూడెం సర్పంచ్ సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, పోశాలు, ఉప సర్పంచ్ నాగేశ్వరావు, శివ, బానోత్ రవి, ముచ్చా సుధాకర్, బొడ్డు అశోక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి... బకాయి కష్టాలు..!




- రూ.38,508 కోట్ల బకాయిలతో సింగరేణికి ఆర్థిక ఒత్తిడి
- తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచే అత్యధిక బకాయిలు
- పన్నెండేళ్లలో పన్నెండు రెట్లు పెరిగిన భారం
- బొగ్గు సరఫరా కొన సాగుతున్నా.. చెల్లింపుల్లో జాప్యం
- సంస్థ విస్తరణ, కొత్త గనులపై ప్రభావం
- ప్రభుత్వ జోక్యంపై పెరుగుతున్న డిమాండ్లు

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

**తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా ప్రభుత్వాల ఘనతగా ప్రచారం పొందుతున్నా, ఆ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన సింగరేణి కాలరీస్ కంపెనీ మాత్రం భారీ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును నిరంతరం సరఫరా చేస్తున్నప్పటికీ, తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో సింగరేణిపై వేల కోట్ల రూపాయల బకాయిల భారం పడింది. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు రూ.3 వేల కోట్లుగా ఉన్న బకాయిలు, జూన్-2026 నాటికి అన్ని సంస్థలు కలిపి రూ.38,508 కోట్లకు చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.**

### ♦ 95 శాతం బకాయిలు తెలంగాణ విద్యుత్ సంస్థలివే..

సింగరేణి బొగ్గును తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు, అలాగే ఎన్టీపీసీకి సరఫరా చేస్తోంది. ప్రైవేట్ సంస్థలకు బొగ్గు సరఫరా చేసే ముందు ముందస్తు చెల్లింపులు తప్పనిసరిగా వసూలు చేస్తున్నందున అక్కడ బకాయిల సమస్య తలెత్తడం లేదు. అయితే ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు అదే ఆర్థిక క్రమశిక్షణ అమలు కాకపోవడంతో బకాయిలు ఏటేటా పేరుకుపోతున్నాయి. జూన్ – 2026 నాటికి సింగరేణికి రావాల్సిన మొత్తం బకాయిలు రూ.38,508 కోట్లు. ఇందులో తెలంగాణ జెన్‌కో రూ.21,589.73 కోట్లు, ట్రాన్స్‌కో రూ.14,818.38 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంటే మొత్తం బకాయిల్లో దాదాపు 95 శాతం తెలంగాణకు చెందిన ఈ రెండు సంస్థలవే. మిగిలిన బకాయిల్లో ఏపీ జెన్‌కో రూ.1,354.91 కోట్లు, కేపీసీఎల్ రూ.613.32 కోట్లు, మహా జెన్‌కో రూ.96.19 కోట్లు, ఎన్టీపీసీ రూ.35.23 కోట్లు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థల నుంచి చెల్లింపులు కొంత మేర క్రమబద్ధంగా జరుగుతున్నప్పటికీ, తెలంగాణ విద్యుత్ సంస్థల బకాయిలే సింగరేణికి ప్రధాన భారంగా మారాయి.

### ♦ ప్రభుత్వ సంస్థల మధ్య ఆర్థిక సమన్వయ లోపం..

రాష్ట్రం ఏర్పడిన 2014లో తెలంగాణ జెన్‌కో సింగరేణికి రూ.1,958 కోట్లు, ట్రాన్స్‌కో రూ.1,042 కోట్లు బాకీ ఉండగా, మొత్తం బకాయిలు రూ.3 వేల కోట్ల పరిధిలోనే ఉన్నాయి. అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ తొలి విడతలో చెల్లింపులు కొంతవరకు సక్రమంగానే జరిగినప్పటికీ, రెండో విడతలో బకాయిలు వేగంగా పెరగడం ప్రారంభమైంది. బీఆర్ఎస్ పాలన ముగిసే నాటికి తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోల బకాయిలు కలిపి రూ.20,924 కోట్లకు చేరుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించలేదు. రెండున్నరేళ్ల వ్యవధిలోనే తెలంగాణ విద్యుత్ సంస్థల బకాయిలు మరో రూ.15 వేల కోట్లకు పైగా పెరిగి, జూన్–2026 నాటికి రూ.36,408 కోట్లకు చేరుకున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో అందడం లేదనే కారణంతో విద్యుత్ సంస్థలు చెల్లింపులను వాయిదా వేస్తుండగా, దాని ప్రభావం పూర్తిగా సింగరేణిపైనే పడుతోంది. ఒక ప్రభుత్వ రంగ సంస్థకు రావాల్సిన నిధులు మరో ప్రభుత్వ రంగ సంస్థ వద్దే నిలిచిపోవడం ఆర్థిక నిర్వహణలో సమన్వయ లోపాన్ని సూచిస్తోంది.

### ♦ మొత్తంగా భారం మోస్తున్న సింగరేణి..

రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో అధిక శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచే వస్తోంది. ఆ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోంది. అయినప్పటికీ బొగ్గు తీసుకుంటున్న విద్యుత్ సంస్థలు సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో సంస్థ నగదు ప్రవాహం తీవ్రంగా దెబ్బతింటోంది. ఆలస్యమైన బకాయిలపై సర్‌చార్జీలు, వడ్డీలు కూడా పెరుగుతుండటంతో ఆర్థిక భారం మరింత అధికమవుతోంది. సింగరేణి ప్రతి ఏడాది కొత్త గనుల అభివృద్ధి, భారీ యంత్రాల కొనుగోలు, భూసేకరణ, ఆధునీకరణ పనులు, కార్మిక సంక్షేమ కార్యక్రమాల కోసం భారీ పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అయితే వేల కోట్ల రూపాయలు బకాయిల రూపంలో నిలిచిపోవడంతో సంస్థ అభివృద్ధి ప్రణాళికలపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నగదు కొరత కారణంగా భవిష్యత్ పెట్టుబడులు, విస్తరణ ప్రాజెక్టులు మందగించే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు నిరంతరం బొగ్గు అందిస్తున్న సింగరేణి ఆర్థికంగా బలహీనపడితే దాని ప్రభావం భవిష్యత్తులో విద్యుత్ రంగం పైనా పడే అవకాశం ఉంది. ఒకవైపు రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు బొగ్గు సరఫరాను కొనసాగిస్తూనే, మరోవైపు వేల కోట్ల రూపాయల బకాయిలను భరిస్తున్న పరిస్థితి సంస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకంగా జోక్యం చేసుకుని తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో బకాయిలను దశలవారీగా చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సంస్థ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బకాయిల సమస్యను త్వరగా పరిష్కరించకపోతే సింగరేణి విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం, రాష్ట్ర విద్యుత్ రంగంపై కూడా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఘనంగా NFAEE 8వ అఖిల భారత మహాసభలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి... )

ఒకసారి జరిగే ఈ మహాసభలు ఉద్యోగుల భవిష్యత్తుకి ఇది ఎంతో కీలకమన్నారు. ప్లాంట్ పరిధిలో ఈ ప్రతిష్టాత్మక సదస్సు ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.అణుశక్తి విభాగం ఉద్యోగుల సమస్యలపై కార్మిక నేతలు సభలో తీర్మానాలు వెల్లుపరిచారు. కేంద్రం ఏ మాత్రం ఆలోచించకుండా ఎనిమిదోవ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పినపాక శాసనసభ్యులు మాట్లాడుతూ దేశ ప్రగతిలోని అణుశక్తి రంగ ఉద్యోగుల పాత్ర చాలా ప్రాముఖ్యమైందని కొనియాడారు. ఉద్యోగుల హక్కుల రక్షణకై, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న అటామిక్ ఎనర్జీ ఎంప్లాయిస్ సేవలను అభినందించారు.ఉద్యోగుల ఎదుర్కొని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. "ఎన్ ఎఫ్ ఏఈ ఈ " సంఘం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముందుగా అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ కు సంబంధించిన స్థానిక సమస్యలను, స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు అనంతరం ఎంపీ కోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రస్తావించిన హెవీ వాటర్ ప్లాంట్ సంబంధించిన స్థానిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి సంబంధిత శాఖలకు తీసుకెళ్లి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు . ఉద్యోగుల సంక్షేమ స్థానిక ప్రజల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ నేను ఉన్నానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ వెంకటేశం, సిఐటియు రాజస్థాన్ ప్రతినిధి మరియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ రవీంద్ర శుక్ల, ఎన్ ఎఫ్ ఏ ఈ ఆర్ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ ఎన్ ఎఫ్ ఏ ఈ సెక్రటరీ పాల్గొన్నారు. వాళ్ళతో ముఖ్య నాయకులు అశ్వాపురం మండల అధ్యక్షులు జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచ్,ఉప సర్పంచ్ కార్యకర్తలు ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

# సింగరేణి వైద్యశాలపై విజిలెన్స్ నిఘా?

- వైద్యశాలను సందర్శించి రహస్య విచారణ చేశారా?
- మందుల వివరాలపై ఆరా!
- వివరాలు అడిగి తెలుసుకున్న వైనం!
- ఉద్యోగులు సమయానికి విధులకు హాజరవుతున్నారా అనే పరిశీలన?
- పలు రికార్డులు, హాజరు వివరాలు పరిశీలించిన అధికారుల బృందం?
- సింగరేణి వైద్యశాలలో ఏమీ జరుగుతుందోనన్న ఉత్కంఠ!
- నివేదిక ఆధారంగా వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం?




**ఇల్లందు, జూలై 5 (ప్రజా జ్యోతి)** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ అధికారుల ఆకస్మిక పర్యటన చర్చనీయాంశంగా మారింది. ఆదివారం ఆసుపత్రిని సందర్శించిన విజిలెన్స్ బృందం పలు అంశాలపై రహస్యంగా సమాచారం సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా వైద్యశాల పరిపాలన, మందులు, ఉద్యోగుల విధులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు లోతుగా పరిశీలించినట్లు తెలుస్తుంది. ఈ పరిణామంతో ఆసుపత్రి వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

### ››› మందుల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి?

విజిలెన్స్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండానే ఆసుపత్రికి చేరుకుని వివిధ విభాగాలను పరిశీలించినట్లు తెలుస్తుంది. ఫార్మసీలో ఉన్న మందుల నిల్వలు, కొనుగోలు వివరాలు, పంపిణీ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, అవసరమైన ఔషధాల లభ్యత వంటి అంశాల పై సంబంధిత సిబ్బంది అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. రోగులకు అవసరమైన మందులు సకాలంలో అందుతున్నాయా, కొనుగోలు చేసిన మందుల వినియోగం రికార్డులకు అనుగుణంగా ఉందా అనే అంశాలపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

### ››› ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణపై ఆరా!

ఇల్లందు సింగరేణి వైద్యశాలలో నర్సులు, ఇతర సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా.. లేదా.. బయోమెట్రిక్ వివరాలు.. విధుల రిజిస్టర్లు, డ్యూటీ చార్టులు సక్రమంగా నిర్వహిస్తున్నారా అనే విషయాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. కొన్ని రికార్డులను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరణలు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.

### ››› వైద్య సేవల నాణ్యతపై సమీక్ష?

సింగరేణి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, ఫిర్యాదుల పరిష్కారం, అత్యవసర సేవల నిర్వహణ, పరిశుభ్రత, పరిపాలనా విధానాలపై కూడా అధికారులు వివరాలు సేకరించినట్లు తెలుస్తుంది. అవసరమైన పత్రాల ప్రతులను తీసుకుని సమగ్ర నివేదిక సిద్ధం చేసే ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా విజిలెన్స్ విభాగ అధికారులు అకస్మాత్తుగా ఇలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇల్లందు సింగరేణి వైద్యశాలను సందర్శించడం వెనుక ఏమైనా ఫిర్యాదులు అందాయా.. లేక విజిలెన్స్ విభాగ అధికారులకు ఏమైనా అనుమానం వచ్చి తనిఖీలు చేశారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

### ››› నివేదికలో ఏమి తేలనుంది?

ఇల్లందు వైద్యశాలలో సింగరేణి విజిలెన్స్ విచారణ వెనుక ఏదైనా ప్రత్యేక ఫిర్యాదు ఉందా? లేక సాధారణ తనిఖీల్లో భాగంగానే ఈ పర్యటన జరిగిందా? అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ విషయం పై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో ఉద్యోగులు, కార్మికులు, ప్రజల్లో ఆసక్తి నెలకొంది. విజిలెన్స్ అధికారులు సేకరించిన వివరాల ఆధారంగా సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించే అవకాశముందని సమాచారం. ఆ నివేదికలో ఏవైనా లోపాలు లేదా పరిపాలనా అంశాలు ప్రస్తావనకు వస్తే తదనుగుణంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. మరి కొన్ని రోజుల్లో విచారణ నివేదిక వెలుగులోకి వస్తే ఇల్లందు సింగరేణి వైద్యశాలలో అసలు పరిస్థితి ఏమిటనేది స్పష్టమయ్యే అవకాశముందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ

### పేరాయిగూడెంలో సర్ ఫారాల పంపిణీ చేసిన రాజశేఖర్



అశ్వరావుపేట ఆర్సి / జులై 5( ప్రజా జ్యోతి ):అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం బూత్ నెంబర్ 164 లో ఓటరు నమోదు మరియు సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగింది. యువనాయకుడు ఎన్. రాజశేఖర్ ఆధ్వర్యంలో 'సర్' ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.పేరాయిగూడెం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ నార్లపాటి సత్యవతి తనయుడైన ఎన్. రాజశేఖర్ స్వయంగా హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామంలోని అర్హులైన వారందరికీ ఓటరు సేవలు అందాలనే లక్ష్యంతో యువతను, ప్రజలను సమాయత్తం చేశారు.ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకోవడానికి ఈ ఫారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎల్వోలు కొత్తపల్లి మరియమ్మ, బొబ్బరి తిరపతమ్మ తదితరులు పాల్గొని ఫారాల పంపిణీలో సహకరించారు. స్థానిక నాయకులు, తుమ్మల అభిమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా తాటి రత్నకుమారి 12వ వర్ధంతి










**దమ్మపేట, జూలై 5 (ప్రజాజ్యోతి ):** అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు సతీమణి, తాటి రత్నకుమారి 12వ వర్ధంతి సందర్భంగా దమ్మపేట మండల కేంద్రంలోని వారి నివాసంలో ఆదివారం ఘనంగా స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నివాళి సభలో అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తాటి రత్నకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా నేడు ఉచిత యాంటీ రేబిస్ టీకాల శిబిరం

**టేకులపల్లి,జూలై05,ప్రజాజ్యోతి:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం (జూలై 6) ఉదయం 9 గంటల నుంచి టేకులపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు ఉచిత యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ నివారణ టీకాలను పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రేబిస్ అనేది జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే ప్రాణాంతక వ్యాధి కావడంతో ప్రతి సంవత్సరం పెంపుడు జంతువులకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని పశువైద్య అధికారులు సూచించారు.ఈ టీకాలు వేయించడం ద్వారా పెంపుడు జంతువులతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా రక్షించుకోవచ్చని తెలిపారు. టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ పెంపుడు కుక్కలు, పిల్లులను ఉదయం 9 గంటలకు ప్రాథమిక పశువైద్య కేంద్రానికి తీసుకువచ్చి ఉచిత టీకాలు వేయించుకోవాలని అధికారులు కోరారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్ర మానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం టేకులపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని పశుసంవర్ధక శాఖ సూచించింది.



## ఉచిత శిక్షణతో ఉద్యోగాల కల్పన

- అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జూలై 6న జాబ్ మేళా
- ఎలక్ట్రిషన్, సోలార్ రంగాల్లో అభ్యర్థుల ఎంపిక
- 18 నుంచి 35 ఏళ్ల యువతకు అవకాశం 30 సీట్లు మాత్రమే

**అన్నపురెడ్డిపల్లి, జూలై 5 (ప్రజా జ్యోతి):** నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించే జాబ్ మేళా జూలై 6న సోమవారం అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎన్. వెంకట్రావు తెలిపారు.జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఎలక్ట్రిషన్, సోలార్ రంగాల్లో 30 రోజులపాటు ఉచిత శిక్షణ అందించనున్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేసి ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించనున్నారు. శిక్షణ కాలంలో యూనిఫాం కూడా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.8వ, 9వ, 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో జూలై 6న అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. కేవలం 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి





**ఇల్లందు, జులై 5 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వార్డు కమిటీలు కీలకంగా వ్యవరించాలని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బొళ్ళ సూర్యం లు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు వార్డు కమిటీ సభను కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు అభివృద్ధిలో వార్డు కమిటీ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వార్డులోని ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డులో ఎలాంటి సమస్య ఉన్న ప్రజల చెంతకు వెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, 20 వార్డు కౌన్సిలర్ జాఫర్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రె



స్వర్ణలత, పట్టణ మహిళా అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు పెద్దబోయిన శ్వేత, కాంగ్రెస్ నాయకులు మహబూబ్, లక్ష్మీనారాయణ, ఆలేటి చిన్ని, ఝూన్సీ, సతీష్ కుమార్ పాసి, మాదాసు సుమన్, పొట్ల శ్రీను, చైతన్య, గంటాడి విజయ్, భరత్, ప్రసాద్, నాయిని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెగల్లపాడులో కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ ఎన్నికలు

- ఘనంగ్రామస్థాయి కమిటీలతోనే పార్టీ మరింత బలోపేతం : కోరం సురేందర్





**టేకులపల్లి, జూలై 05,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం ప్రెగల్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీ ఎన్నికలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోరం సురేందర్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలే వెన్నెముకలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రెగల్లపాడు సర్పంచ్ కోరం హనుమంతు సమక్షంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా లక్కినేని మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం ఇటీవల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన లక్కినేని శ్యామ్‌ను గ్రామ ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## నారుమడి తయారీతో అధిక దిగుబడులు సాధించవచ్చు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 5, (ప్రజా జ్యోతి)** వరి సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే ఆరోగ్యకరమైన నారుమడి తయారీకి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన నారు మంచి దిగుబడులకు, అధిక లాభాలకు పునాది అని తెలిపారు, ఒక ఎకరానికి నాట్లు వేయడానికి సుమారు 4 సెంట్ల భూమిని నారుమడిగా సిద్ధం చేయాలని చెప్పారు. భూమిని మెత్తగా దుక్కి చేసి సమతలంగా తయారు చేయాలని సూచించారు. దమ్ము నారుమడి పద్ధతిలో సాగు చేసే రైతులు 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి పొలాన్ని సిద్ధం చేసుకోవాలని తెలిపారు, విత్తనాలను ముందుగా 24 గంటలు నీటిలో నానబెట్టి, అనంతరం 36 గంటలు మూట కట్టాలని, ఇలా చేయడం వల్ల విత్తనాలు త్వరగా, సమానంగా మొలకెత్తుతాయని పేర్కొన్నారు. మొలక వచ్చిన విత్తనాలను సెంటుకు 5 కిలోల చొప్పున నారుమడిలో సమానంగా చల్లాలని సూచించారు. నారుమడిలో పలుచగా నీరు నిల్వ ఉండేలా నిర్వహిస్తే నారు ఆరోగ్యంగా పెరిగి, సరైన సమయంలో నాటేందుకు అనుకూలంగా తయారవుతుందని తెలిపారు. నారు దశలో సరైన సంరక్షణ చేపడితే పంట ప్రారంభం నుంచే మంచి ఎదుగుదల ఉండి, దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి నారుమడిని సిద్ధం చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. అదేవిధంగా పంట ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సాంకేతిక సలహాలను వినియోగించుకోవాలని సూచించారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ప్రజలకు దమ్మపేట టీడీపీ నాయకుల పిలుపు




**దమ్మపేట, జూలై 5 (ప్రజాజ్యోతి):** ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మపేట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన మండల కమిటీ ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో ప్రజలు ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు లేకపోవడం లేదా వివరాలు తప్పుగా ఉండడం వల్ల ఎన్నికల సమయంలో ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఓటరు బాధ్యతగా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండి వలీపాషా, తెలుగురైతు నాయకులు గడ్డిపాటి సత్యనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లెల గాంధీ, నాయకులు శరమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో చరమల్ల రాజా, పానుగంటి రామారావు, చక్రపు ప్రసాద్, అల్లాడి అప్పారావు, భోగి సత్యం, చెర్ర ధర్మారావు, యలమాటి బాబ్జీ, సజ్జ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: ఎల్‌హెచ్‌పీఎస్

- గిరిజన గురుకులాల వ్యవహారంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్
- అక్రమాలపై కఠిన చర్యలు లేకుంటే కలెక్టరేట్ ముట్టడి హెచ్చరిక



**టేకులపల్లి, జూలై 05,ప్రజాజ్యోతి:** గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న అవినీతి, అక్రమాలపై సమగ్రంగా,నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నంగారా భేరి–లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు భూక్య లాలు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎల్ హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పైసెంటర్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో విద్యా వ్యవస్థ దెబ్బతిని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గత మూడు, నాలుగు నెలలుగా గిరిజన గురుకులాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎల్ హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గిరిజన గురుకుల విభాగంలో ఆర్‌సీఓ స్థాయిలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి, అక్రమాలపై రాష్ట్ర స్థాయి అధికారులకు, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని విచారణ అధికారిగా నియమించిందన్నారు. దీనిని ఎల్‌హెచ్‌పీఎస్ పోరాట విజయంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలోని ఏ శాఖలో అవినీతి జరిగినా నంగారా భేరి–లంబాడ హక్కుల పోరాట సమితి రాజీపడకుండా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నిష్పక్షపాత విచారణ నిర్వహించి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే భారీ ఎత్తున కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దారావత్ లక్ష్మణ్, మూడ్ మురళి, అజ్మీరా రమేష్, బోడ మంచ నాయక్, బానోత్ దేవా, భూక్య బాలు నాయక్, బానోత్ మోహన్, భూక్య భావసింగ్, భూక్య లల్సింగ్‌తో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.